సాక్షి జనగామ

మంగళవారం । 20 । మే । 2025



పుష్కర విధుల్లో అతివలు

కాళేశ్వరంలోని సరస్వతీనది పుష్కరాల్లో పురుషులకు దీటుగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

- 8లో▸



కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీ

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏసీపీల బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఏసీపీలకు స్థానచలనం కలిగింది.

- 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోత ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రతీఒక్కరు భక్తిభావాన్ని కలిగి ఉండాలి



పాలకుర్తి: ప్రతీఒక్కరు భక్తిభావాన్ని కలిగిఉండాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ అన్నారు. మండలంలోని వల్మిడి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించగా.. మాజీ మంత్రి దయాకర్ రావుతో కలిసి బండా ప్రకాశ్ సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, ముదిరాజ్ మహాసభ నాయకులు నీరటి చంద్రయ్య, మాచర్ల ఎల్లయ్య, ఉత్సవ కమిటీ మోకాటి కొమురయ్య, వంగ సైదులు, నీరటి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి



పాలకుర్తి టౌన్: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వ రాయితీపై అందించిన జీలుగ విత్తనాలను ఎమ్మెల్యే.. రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పెంచుకునేందుకు జీలుగ విత్తనాలు దోహదపడతాయని తెలిపారు. రైతుల ఆర్థికంగా నష్టపోకూడదని జీలుగ విత్తనాలు రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పాలకుర్తి సబ్ డివిజన్ ఉపసంచాలకులు అజ్మీరా పరశురామ్‌నాయక్, మండల వ్యవసాయ అధికారి శరత్‌చంద్ర, నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, యాకాంతరావు, నాగన్న, సలీం, రైతులు పాల్గొన్నారు.

రక్తహీనత లేని సమాజాన్ని నిర్మిద్దాం



జనగామ: రక్తహీనత లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కార్యాలయంలో ఫార్మసీ ఆఫీసర్స్‌తో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో 50 నుంచి 60 శాతం మేర మహిళలు, చిన్న పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. మహిళలకు ఐరన్ ఫోలిక్ మాత్రలు, పిల్లలకు ఐరన్ సిరప్‌లను అందించేందుకు జిల్లాకు ఇండెంట్‌తోపాటు సరఫరా చేసే విధానంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. రక్తహీనతకు సంబంధించి మాత్రలు, సిరప్‌ల కొరత లేకుండా ఫార్మసీ ఆఫీసర్స్ అలర్ట్‌గా ఉండాలన్నారు. పీహెచ్‌సీల వారీగా నిల్వ ఉన్న మందుల సమాచారం ఫిజికల్, ఆన్‌లైన్‌లో సరిగ్గా ఉండే విధంగా చూసువాలన్నారు. జిల్లా ఫార్మసీ ఆఫీసర్ రాజేందర్ తదితరులు ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించకుంటే చర్యలు తప్పవు



జనగామ: కాంగ్రెస్ పార్టీలో ప్రొటోకాల్ పాటించకుంటే ఎంతటి వారైనా చర్యలు తప్పవని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ హెచ్చరించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో జనగామ, చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుగు బాలరాజు గౌడ్, మల్లేష్‌తో కలిసి మాట్లాడారు. జనగామలో గ్రూప్ రాజకీయాలకు చెక్ పెట్టి, ప్రతి ఒక్కరూ పార్టీ ప్రోటోకాల్ ప్రకారం నడుచుకోవాలన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచన మేరకు పార్టీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నాగపురి కిరణ్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరి గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాడన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల మంజూరులో కమీషన్లకు తెరలేపుతున్నాడని ఆరోపించారు. కిరణ్‌పై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు గంగం నరసింహారెడ్డి, ఆలేటి సిద్ధిరాములు, బక్క శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, యాదగిరిగౌడ్, సాయిలు, బన్సీ నాయక్, అనిల్ పాల్గొన్నారు.

నదిలో దీపం వదులుతున్న కుటుంబం



పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



త్రివేణి సంగమం.. భక్తజన సంద్రం

కాళేశ్వరంలో భక్తుల సందడి

- పుణ్యస్నానాలు ఆచరించిన వేలాది భక్తులు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

త్రివేణి సంగమం.. భక్త జన సంద్రమైంది. పుష్కరిణి స్నానం.. పులకించేలా చేసింది. వడివడిగా పరుగులు పెడుతున్న చల్లని తల్లికి వాయినాలిచ్చే ఆడపడుచులు.. పితృదేవతలను స్మరిస్తూ తర్పణాలు వదిలే పురుషులు. కేరింతలు కొడుతూ అల్లరి చేస్తున్న యువతులు, చిన్నారులతో నదీ ప్రాంతం సందడిగా మారింది. ఐదో రోజు సోమవారం వేలాదిగా భక్తులు కాళేశ్వరానికి తరలివచ్చారు. ముక్తీశ్వరున్ని దర్శించుకునేందుకు గంటల కొద్దీ క్యూలో వేచి చూశారు.

- వివరాలు, మరిన్ని ఫొటోలు 8లో▸

కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



పాత స్టాక్.. కొత్తధరలు

ధరలు పెరగడంతో ఆలస్యంగా తెరిచిన వైన్స్

- మద్యం ప్రియుల మండిపాటు
- కనిపించని ధరల పట్టిక
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



తరిగొప్పులలో మధ్యాహ్నం 12.30 గంటలు దాటినా తెరుచుకోని వైన్స్





స్టేషన్ ఘన్‌పూర్‌లో మధ్యాహ్నం సమీపించినా మూసి ఉన్న మద్యం దుకాణం

జనగామ: తెలంగాణ ప్రభుత్వం పెంచిన లిక్కర్ ధరలు.. మద్యం దుకాణాలకు కాసులు కురిపించాయి. పాత స్టాక్.. పాత ధరలకే విక్రయించాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినా.. వ్యాపారులు పెడచెవిన పెట్టారు. ఉదయం 10 గంటలకు తెరుచుకోవాల్సిన లిక్కర్ దుకాణాలు.. మధ్యాహ్నం 12.30 గంటలు దాటినా మూసే ఉంచారు. డిపోల ద్వారా నూతన బిల్లింగ్ పూర్తయ్యే వరకు కొన్ని చోట్ల షాపులు తెరవలేదు. లిక్కర్ దుకాణాలకు వచ్చే రెగ్యులర్ కస్టమర్లు షాపులు మూసి ఉండడంతో ఆందోళనకు గురి కాగా, పాత స్టాక్‌ను కొత్తగా అమ్ముకునేందుకే ఇలా చేశారనే ప్రచారం జరిగింది. ఇదంతా ఎక్సైజ్ శాఖ చూసీ.. కూడా చూడనట్టు వ్యవహరిస్తూ మద్యం దుకాణదారులకు సహకారం అందించిందనే ఆరోపణలు బాహాటంగానే వినిపించాయి.

మద్యం ప్రియుల జేబులు లూటీ..!

రాష్ట్ర ప్రభుత్వం క్వార్టర్‌పై రూ.10, ఆఫ్ రూ.20, ఫుల్ బాటిల్ లిక్కర్‌పై రూ.40 వరకు పెంచుతూ ఈ నెల 18వ తేదీన జీఓ జారీ చేసింది. వైన్స్‌లో ఉన్న పాత స్టాక్‌కు కొత్త రేట్లు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ, ఓల్డ్ స్టాక్‌పై ఎంతో కొంత వెనకేసుకోవాలనే ఆలోచనతో దుకాణాదారులు సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలు దాటిన తర్వాత వైన్స్ తెరిచి కొత్త ధరలతో స్టాక్ విక్రయించారు. ఇదేంటని మద్యం ప్రియులు నిలదీస్తే 'ఎక్సైజ్ అధికారులు వచ్చారు.. పాత స్టాక్ వివరాలు రాసుకున్నారు.. వీటికి చలానా రూపంలో అదనపు డబ్బులు వసూలు చేస్తారు' అని చెప్పి కొత్త ధరలకు లిక్కర్ విక్రయించారు. కానీ, ప్రభుత్వం పాత స్టాక్ పూర్తయ్యే వరకు ఓల్డ్ రేట్లు మాత్రమే తీసుకోవాలని స్పష్టంగా చెప్పింది. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. ఎక్సైజ్ అధికారుల బూచీ చూపెడుతూ.. మద్యంవ్యాపారులు మద్యం ప్రియుల జేబులను ఖాళీ చేశారు. ఇదిలా ఉండగా లిక్కర్ ధరలు పెంచుతూ ప్రభుత్వం 18వ తేదీ సాయంత్రం సర్క్యులర్ జారీ చేయగా, అదే రోజు జిల్లాలోని చాలా చోట్ల గంట ముందుగానే వైన్స్ మూసివేశారు. కాగా, జిల్లాలో 47 మద్యం దుకాణాలు ఉండగా, రోజు వారీగా రూ.1.10 కోట్ల మేర వ్యాపారం జరుగుతుంది. పాత ధరలపై కొత్త రేట్లతో విక్రయించడంతో సుమారు రూ.5లక్షల వరకు మద్యం బాబులపై అదనపు వడ్డన పడింది.

కానరాని ఎక్సైజ్ శాఖ

ధరల పెంపు సమయంలో విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిఘా ఉండాలి. దుకాణాలు ఎప్పుడు తెరుస్తున్నారు.. అదనపు ధరలు తీసుకుంటున్నారా.. లేదా.. అని చెక్ చేసుకోవాలి. పాత స్టాక్ పాత ధరలకే విక్రయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా.. జిల్లాలో ఎవరూ పాటించలేదు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ నిమ్మకుండిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్స్ మధ్యాహ్నం 12.30 గంటల వరకు తెరుచుకోకున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు ఏ ఒక్క వైన్స్ వద్ద కూడా కొత్త ధరలు సూచించే ఫ్లెక్సీ కన్పించకపోవడం గమనార్హం.

అదనపు ధర తీసుకున్నారు..



కొత్త స్టాక్ రాకముందే వైన్స్‌లో ఉన్న పాత స్టాక్ పెరిగిన ధరలకు విక్రయిస్తున్నారు. క్వార్టర్‌కు రూ.10 అదనంగా తీసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. తీసుకుంటే తీసుకో, లేకుంటే లేదని దురుసుగా మాట్లాడుతున్నారు.

- గంగాపురం ఉప్పలయ్య, ఫతేషాపూర్, రఘునాథపల్లి

ఇదేం దోపిడీ



ఐకానిక్ బ్లూ క్వార్టర్‌పై ఎమ్మార్పీ రూ.180 ఉంటే, కొత్త సరుకు రాకముందే పెరిగిన ధర తీసుకున్నారు. బాటిల్‌పై అదనంగా రూ.10 తీసుకోవడంపై నిలదీస్తే సమాధానం చెప్పడం లేదు. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- దయాకర్, తరిగొప్పుల

హెచ్చరించాం..

ప్రభుత్వ నిబంధనల మేరకు పాత స్టాక్ లిక్కర్‌ను కొత్త ధరలకు విక్రయించొద్దని హెచ్చరించాం. అలా చేసే కేసులు తప్పవు. దుకాణాలు మధ్యాహ్నం తెరిచిన విషయంపై విచారణ జరిపిస్తాం.

- ప్రభావతి, జనగామ ఎక్సైజ్ సీఐ

ఇందిరమ్మ ఇళ్ల పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్లు, అధికారులు

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని, ఇళ్ల పెండింగ్ దరఖాస్తుల సర్వే, మార్కింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి సోమవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 90 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. పైలట్ మండలాల కింద 12 గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ మార్కింగ్ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులను ఎంపిక చేసేందుకు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరుగుతోందని, 20 శాతం ధాన్యం కొనుగోలు మిగిలి తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కేంద్రాలను తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. తాగునీటి సరఫరాలో వేసవి కార్యాచరణ ప్రణాళికను సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. ఎరువుల దుకాణాలను తహసీల్దార్లు, ఏఈఓలు, ఎంఏఓలు, మండల ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, జిల్లాకు సరిపడా విత్తనాలు వచ్చాయని, విత్తనాల కొరత రాకుండా, నాణ్యమైన విత్తనాల క్రయ విక్రయాలు జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి దుకాణంలో ధరల పట్టిక బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఘనపూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, డిప్యూటీ జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీసీఎస్ఓ సరస్వతి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపన

- హాజరైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి



మహంకాళి దేవాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే, ధర్మకర్త తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామంలో శ్రీమహంకాళి అమ్మవారు, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, నిర్మాణకర్త కుందూరు సోమిరెడ్డి, నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎంపీకి, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకరించిన ధర్మకర్త సోమిరెడ్డికి, ఆలయ నిర్మాణానికి నిధుల కేటాయించిన ఎంపీ కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో సముద్రాల గ్రామపరిధిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగమణి, సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఇనుగాల లలితాదేవి, గుండె విమలనర్సయ్య, కుమారస్వామి, నాయకులు భాస్కుల కిరణ్, రాజు, నారాయణ, హరిప్రసాద్, రవీందర్, రాజు, నర్సింహులు, కిషన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా పాకిస్తాన్‌తో పోరాడాం

- ప్రజల కోసం పని చేస్తున్న మోదీ
- ఎంపీ ఈటల రాజేందర్



యాత్రలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

జనగామ రూరల్: పహల్గాం ఉగ్రదాడికి బదులుగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైనికులు దేశం గర్వించేలా పాకిస్తాన్‌తో పోరాడడం గొప్ప విషయమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని స్మరించుకుంటూ సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యంలో జనగామ రైల్వేస్టేషన్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ వరకు తిరంగా యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ రాజేందర్ మాట్లాడుతూ.. భరతమాత నుదిటి మీద తిలకం తుడిచిన వారిని మట్టు పెట్టడానికి 'ఆపరేషన్ సిందూర్' పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విషయంలో చాలా మంది తప్పుడు ప్రచారం చేసినా.. మోదీ భయపడలేదన్నారు. దేశాన్ని ప్రపంచంలో విశ్వ గురువు స్థానానికి తీసుకువెళ్తున్నారని వివరించారు. కాజీపేట రైల్వేస్టేషన్‌కు కోచ్ ఫ్యాక్టరీ రాబోతుందని, జనగామ రైల్వేస్టేషన్‌ను రూ.26 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నంద రెడ్డి, మాజీ ఎంపీ గుండె విజయరామారావు, ఆరుట్ల దశమంత్ రెడ్డి, ఉడుగుల రమేష్, కేవీఎల్ ఎన్.రెడ్డి, శివరాజ్, కత్తుల లక్ష్మి, దేవరాయ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కారమయ్యేనా..?

- గ్రీవెన్స్‌లో బాధితుల ఆవేదన
- ప్రజల నుంచి 74 వినతుల స్వీకరణ



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు

జనగామ రూరల్: కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, తిరుగుడు తప్ప పరిష్కారం కావడంలేదని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సుమారు 74 వినతులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా సైతం గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారంపై అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్టేషన్ ఘనపూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, డిప్యూటీ జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీసీఎస్ఓ సరస్వతి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని ఇలా..

- దేవరుప్పుల మండలం కామారెడ్డి గూడేనికి చెందిన నాగిడి మల్లారెడ్డి హాస్పిటల్‌కి వెళ్లిన సమయంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేశారు. మళ్లీ సర్వే చేసి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు.
- రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామం చెందిన జట్టి వెంకటయ్య, తన 4.5 ఎకరాల వ్యవసాయ భూమికి దారి లేక ఇబ్బంది పడుతున్నానని పరిష్కారం చూపాలని కోరాడు.
- బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ గ్రామం చెందిన గీస పోశమ్మ తనకు ఎలాంటి పనిలేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందని వృద్ధాప్య ఫించన్ మంజూరు చేయాలని కోరింది.
- జనగామ మండలం మరిగడి పరిధిలోని టాక్య తండాకు చెందిన రామావత్ శంకర్ తమ ఊరిలో మిషన్ భగీరథ ద్వారా నీరు రావడం లేదని, తండాకు నీరందించాలని కోరాడు.

షాపు నుంచి గెంటేశాడు..



జనగామ బస్టాండ్‌లోని స్టాల్ నంబర్ 03లో జగదాంబ పాప్‌కార్న్ షాపునకు జనగామకు చెందిన గుగులోత్ వెంకట్‌తో కలిసి టెండర్ వేయగా వెంకట్ పేరున టెండర్ వచ్చింది. ఆయనతో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నాను. షాపు అద్దె రూ.50 వేలు కూడా చెల్లించాను. అగ్రిమెంట్ ప్రకారం సంవత్సరంపాటు భాగస్వాములుగా ఉండాల్సి ఉండగా రెండు నెలల తర్వాత షాపు నుంచి గెంటేశాడు. పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే కానిస్టేబుళ్లను పంపించి నన్నే షాపు నుంచి బయటికి పంపించేశారు. అట్రాసిటీ కేసు పెడుతామని బెదిరిస్తున్నారు. న్యాయం చేయాలి.

- నామాల రాజు, వడ్లకొండ

సీసీ రోడ్డు వేయాలని చూస్తున్నారు



వావిలాల గ్రామంలో సర్వే నంబర్ 784లో ఇంటి స్థలం 10 గుంటలు ఉంది. నా భూమి నుంచి సీసీ రోడ్డు వేయకుండా గ్రామస్తుల సమక్షంలో గతంలో తీర్మానం చేసుకున్నాం. ఇప్పుడు సీసీ రోడ్డు వేయాలని చూస్తున్నారు. విచారణ జరిపించి న్యాయం చేయాలి.

- అనపర్తి అయిలయ్య, వావిలాల, పాలకుర్తి

పహాణీలో భూమి తక్కువగా పడింది.



గ్రామంలో సర్వే నంబర్ 544 బై ఏలో 2.20 గుంటల భూమి ఉంది. అన్నదమ్ములు పంపిణీ చేసుకోగా 33 గుంటలు రాగా పహాణీలో 27 గుంటలుగా నమోదైంది. అధికారుల చుట్టూ తిరిగినా పని కావడం లేదు. 6గుంటల భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

- యాదయ్య, కుందారం, లింగాలఘణపురం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

- నాగపురి వర్సెస్ కొమ్మూరి వర్గం
- ఇరు వర్గాల మధ్య తోపులాట
- ఉద్రిక్తత, పోలీసుల రంగ ప్రవేశం



ఘర్షణ పడుతున్న ఇరువర్గాల నాయకులు

జనగామ: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ పార్టీ వర్గపోరు మరోసారి బయటపడింది. నాగపురి –కొమ్మూరి వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు తోపులాడుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద సోమవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో రూ.10లక్షల విలువ చేసే 24 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసే సమయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి వర్గీయులు అడ్డుకున్నారు. జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రోటోకాల్, అనుమతి లేకుండా కిరణ్ చెక్కులను పంపిణీ చేయడం ఏంటని ప్రశ్నించారు. గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య తోపులాట, ఒకరిపై ఒకరు చేయి వేసుకునే వరకు వెళ్లింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువురిని సముదాయించి పంపించారు. చెక్కులను పంపిణీ చేసేందుకు నాగపురి కిరణ్ తన వర్గీయులతో కలిసి సిద్ధిపేటరోడ్డు గాయత్రి గార్డెన్‌కు చేరుకున్నారు. డీసీసీ అధ్యక్షులు లేకుండా చెక్కులను ఎక్కడా పంపిణీ చేయొద్దని కొమ్మూరి వర్గీయులు వచ్చి అడ్డుకున్నారు. పార్టీ పోరు తీస్తున్నారంటూ కొమ్మూరి అనుచరవర్గం కిరణ్ వర్గంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అరగంటపాటు మాటల యుద్ధంతో కొట్టుకున్నంత పని చేశారు. ఏఎస్పీ చేతన్ నితిన పండేరీ ఆధ్వర్యంలో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు.. నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్‌తోపాటు కొమ్మూరి వర్గీయులను అక్కడ నుంచి పంపించారు. అనంతరం షామీర్‌పేటలోని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక మహేందర్ నివాసం వద్ద కిరణ్ చెక్కులను పంపిణీ చేశారు.

జిల్లాలో తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

జనగామ: జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లు ఇటీవల మల్టీజోన్–2లో బదిలీలు కాగా.. ఖాళీగా ఉన్న స్థానాల్లో పోస్టింగ్‌లు ఇస్తూ సోమవారం రాత్రి కలెక్టర్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా డొంకెన స్వప్నకు పోస్టింగ్ ఇచ్చారు. బచ్చన్నపేట తహసీల్దార్‌గా పని చేస్తున్న తిరుపతి ప్రకాశ్‌రావు సూర్యాపేట జిల్లాకు బదిలీ కాగా, అక్కడే పని చేస్తున్న నాయబ్ తహసీల్దార్ ఫణికిశోర్‌కు పూర్తి అదనపు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలను అప్పగించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ కార్యాయలంలో డీఏఓగా పని చేస్తున్న వెంకన్న.. సూర్యాపేట జిల్లాకు బదిలీ కాగా, అక్కడే పని చేస్తున్న నాయబ్ తహసీల్దార్ టి.క్రాంతి కుమార్‌కు పూర్తి అదనపు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

నదికి మొక్కుతున్న భక్తులు


చిన్నారికి స్నానం చేయిస్తున్న కుటుంబీకులు


భక్తురాలి పూనకం



పుణ్యస్నానానికి వస్తున్న భక్తజనం

పుష్కరం.. పుణ్యఫలం..




ఉదకం వదులుతున్న భక్తులు


స్నానమాచరిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ కుటుంబం


హారతి తీసుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



పుష్కరుడికి నీళ్లు వదులుతున్న మహిళలు


నది తీరంలో భక్తుల కోలాహలం


నదిలో కుటుంబం సంతోషం


అస్వస్థతకు గురైన కానిస్టేబుల్‌ను 108లో తరలిస్తున్న సిబ్బంది

కాళేశ్వరంలో ఇద్దరికి గుండెపోటు

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో ఇద్దరు భక్తులు ఆదివారం గుండెపోటుకు గురయ్యారు. ముక్తీశ్వరస్వామి ఆలయ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పాండునాయక్ స్పృహతప్పి పడిపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న డాక్టర్ రఘురామ్, సిబ్బంది సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందించారు. అలాగే, ఏపీలోని పిఠాపురానికి చెందిన కె.వీర్రాజు వీఐపీ ఘాట్ వద్ద ఎండ వేడికి కళ్లు తిరిగి కింద పడిపోగా బీపీ తగ్గింది. దీంతో 108లో పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

ప్రముఖుల పుష్కర స్నానం..



స్వామిజీకి సరస్వతీమాత విగ్రహం బహూకరిస్తున్న అధికారులు, పుష్కర స్నానమాచరిస్తున్న హైకోర్టు జడ్జి నర్సింగరావు దంపతులు

కాటారం/కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా సోమవారం పలువురు ప్రముఖులు పుష్కర స్నానం ఆచరించారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు దంపతులు, త్రయంబకేశ్వర్ నాసిక్‌కు చెందిన మహామండలేశ్వర్ ఆచార్య సంవిధానందాసరస్వతి మహారాజ్ స్వామి సరస్వతి ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం సరస్వతి మాతను దర్శించుకుని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జడ్జి దంపతులను కలెక్టర్ రాహుల్‌శర్మ, భూపాలపల్లి న్యాయమూర్తి అఖిల మర్యాదపూర్వకంగా కలిసి సరస్వతీమాత చిత్రపటం అందజేశారు. ఆలయ అధికారులు సంవిధానందాసరస్వతి మహారాజ్ స్వామికి సరస్వతీమాత విగ్రహం బహూకరించారు.

శివుడి ప్రతిమ సెట్టింగ్‌కు మంటలు


మంటలు ఆర్పుతున్న పోలీసులు

కాటారం: పుష్కరాల్లో భాగంగా సరస్వతి(వీఐపీ)ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ సెట్టింగ్‌కు సోమవారం మంటలు అంటుకున్నాయి. థర్మకోల్‌తో తయారు చేసిన శివుడి ప్రతిమ సెట్టింగ్ వద్ద భక్తులు పుష్కర స్నానం అనంతరం దీపాలు వెలిగిస్తున్నారు. ఈ క్రమంలో దీపాలు ప్రతిమ కింద గల థర్మకోల్ స్టాండ్‌కు అంటుకుని మంటలు చెలరేగాయి. అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులు నీళ్లతో మంటలు ఆర్పారు. భక్తులు దీపాలు వెలిగించకుండా చర్యలు చేపట్టారు.

పుష్కర విధుల్లో అతివలు..

పురుషులకు దీటుగా మహిళా ఉద్యోగుల సేవలు
- అధికంగా పోలీస్, వైద్యారోగ్య, శిశు సంక్షేమ శాఖలు
- భక్తిభావంతో పన్నెండు రోజుల పాటు విధుల నిర్వహణ

కాటారం/మల్హర్ : ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు.. ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులతో సమానంగా పోటీపడుతూ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానంలో నిలుస్తున్నారు. ఉద్యోగాలు పొందిన అనంతరం విధి నిర్వహణలో పురుషులతో సరిసమానంగా ముందుకెళ్తున్నారు. ఎంతకష్టమైనా ఉన్నతాధికారులు కేటాయించిన విధులు సమర్థవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీస్, వైద్యారోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖల్లో పలు కేడర్లకు చెందిన మహిళా ఉద్యోగులు, సిబ్బంది పుష్కరాల్లో భక్తులకు సేవలందిస్తున్నారు.


ప్రధాన ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఎస్సై

సుమారు 300 మంది మహిళా ఉద్యోగులు..

సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా పోలీస్, వైద్యారోగ్య, మహిళా, శిశు సంక్షేమశాఖల పరిధిలో సుమారు 300 మంది మహిళా ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. ఇందులో పోలీస్‌శాఖలో సుమారు 80 మంది మహిళా ఎస్సైలు, కానిస్టేబుళ్లు, వైద్యారోగ్య శాఖలో 30 మంది మహిళా వైద్యులు, 120 మంది ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు, మహిళా, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి సుమారు 70 మంది మహిళా ఉద్యోగులు, సిబ్బంది భక్తులకు తమ శాఖల ద్వారా సేవలు అందిస్తున్నారు. ప్రధాన ఆలయం, త్రివేణి సంగమం, సరస్వతి పుష్కరఘాట్ వద్ద విధులు నిర్వర్తిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పలువురు మహిళా ఉద్యోగులు 'సాక్షి' పలకరించగా తమ అనుభూతులను పంచుకున్నారు.

భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉంది..



పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాల్లో భాగంగా భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉంది. ఉద్యోగ పరంగానే కాకుండా సేవ చేయాలనే ఉద్దేశంతో పుష్కర విధులకు వచ్చా. కొన్ని సందర్భాల్లో కష్టం అనిపించినా ఓర్చుకుని ముందుకెళ్తున్నా..

\- లలిత, ఎస్సై

మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సేవలు..



పుష్కరాల్లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సేవలందిస్తున్నాం. ప్రతీ రోజు దగ్గర ఉండి పుష్కరాలకు వచ్చే మహిళలు, చిన్నారులకు న్యూట్రీషన్ ఫుడ్ అందిస్తున్నా. రెగ్యులర్ డ్యూటీ అయినా ఇంత గొప్పగా కొనసాగుతున్న పుష్కరాల్లో సేవలు అందించడం సంతోషంగా ఫీల్ అవుతున్నా..

\- మల్లీశ్వరి, జిల్లా సంక్షేమాధికారి, భూపాలపల్లి

భక్తిభావంతో పని చేస్తున్నా..



పుష్కరాల్లో భక్తిభావంతో భక్తులకు వైద్య సేవలందిస్తున్నా. పుష్కరాల్లో డ్యూటీ చేయడం కొత్త అనుభూతి ఇస్తుంది. నిత్యం అనేక మంది భక్తులు ఏదో ఒక రకమైన వైద్యం కోసం మా దగ్గరకు వస్తున్నారు. వారి ఆధ్యాత్మిక చింతన చూస్తే ఆనందం అనిపిస్తుంది.

\- అఖిల, వైద్యురాలు

అదృష్టంగా భావిస్తున్నా..



పుష్కరాల్లో విధుల్లో భాగంగా భక్తులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నేను మొదటి సారి పుష్కరాల విధుల్లో పాల్గొన్నా. కాళేశ్వర ఆలయ ఆవరణలో దైవసేవలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ఏకాగ్రతతో పని చేస్తున్నా. మాపై ఆ స్వామి వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నా.

\- ప్రవళిక, కానిస్టేబుల్

పుష్కర ఏర్పాట్లు భేష్..


- ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రు నాయక్


ఏర్పాట్లపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల ఏర్పాట్లు భేష్‌గా ఉన్నాయని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి విప్ కుటుంబ సమేతంగా సోమవారం పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పుష్కర ఏర్పాట్లు పరిశీలించి కలెక్టర్, అధికారులను అభినందించారు. విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాళేశ్వర ముక్తీశ్వరుడిని కోరుకున్నట్లు తెలిపారు.

అనుమానిస్తున్నాడని.. కడతేర్చారు

- వ్యక్తి హత్య కేసులో అత్తామామ, భార్య అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్యను అనుమానిస్తున్నాడని భర్తను అత్తామామ, భార్య కలిసి కడతేర్చారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారం తండాలో చోటుచేసుకుంది. ఈ హత్య కేసు వివరాలను మహబూబాబాద్ డీఎస్పీ ఎన్.తిరుపతిరావు సోమవారం రూరల్ పీఎస్‌లో వెల్లడించారు. తండాకు చెందిన బానోత్ వీరన్న కూతురు మౌనికను తొమ్మిది సంవత్సరాల క్రితం బల్లార్ష ప్రాంతానికి చెందిన లకావత్ బాలకు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమారులు ఉండగా, 5 సంవత్సరాల నుంచి దంపతులు హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో మౌనిక వివాహేతర సంబంధ విషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మౌనిక తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఇదే విషయమై ఈ నెల 17వ తేదీన బాల, అతడి అన్న లకావత్ బావుసింగ్ ధర్మారం తండాకు వెళ్లి మౌనికతో గొడవ పెట్టుకున్నారు. అంతలోనే భార్య మౌనిక, మామ వీరన్న, అత్త కైల కలిసి బాల, బావుసింగ్ కళ్లలో కారం చల్లారు. దీంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. కొద్ది సమయం తర్వాత బాల తన అత్తగారింటికి వెళ్లి తమను చంపాలని చూస్తారా అని గొడవ పెట్టుకున్నాడు. ఆ వెంటనే అతడి భార్య మౌనిక, అత్త కైల కొట్టగా మామ వీరన్న కత్తితో ఛాతీలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాలను 108లో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అదే రాత్రి 10 గంటలకు మృతిచెందాడు. ఈ ఘటనలో అత్తామామ వీరన్న, కైల, భార్య మౌనికను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏసీపీ బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఏసీపీలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేట ఏసీపీగా పనిచేసిన వి.కిరణ్‌కుమార్.. డీజీపీ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న పున్నం రవీందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగం డీఎస్పీగా పనిచేసిన పి.ప్రశాంత్‌రెడ్డిని కాజీపేట ఏసీపీగా, మామునూరు ఏసీపీగా పనిచేస్తున్న బి.తిరుపతి డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఖమ్మం ఎస్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న ఎన్.వెంకటేష్ బదిలీపై వచ్చారు. రాచకొండ 'షీ' టీమ్ ఏసీపీగా పనిచేస్తున్న పి.నర్సింహారావు హనుమకొండ ఏసీపీగా, హనుమకొండ ఏసీపీగా పనిచేస్తున్న కొత్త దేవేందర్ రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న పి.సదయ్య వరంగల్ సీసీఎస్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఇప్పటికే బదిలీ అయిన స్థానాల్లో పలువురు ఏసీపీలు రిపోర్టు చేశారు. నర్సంపేట ఏసీపీగా పనిచేసిన కిరణ్‌కుమార్ సీసీఎస్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. పి.ప్రశాంత్‌రెడ్డి కాజీపేట ఏసీపీగా, నర్సంపేట ఏసీపీగా పున్నం రవీందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వెలువడిన ఉత్తర్వుల్లో సీసీఎస్ ఏసీపీగా పి.సదయ్య బదిలీ అయినట్లు ఉండడం గందరగోళానికి తావిస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో బదిలీ ఉత్తర్వులపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శిగా వలీఉల్లాఖాద్రీ



కేయూ క్యాంపస్: అఖిల భారత యువజన సమైక్య(ఏఐవైఎఫ్) జాతీయ కార్యదర్శిగా వరంగల్‌కు చెందిన డాక్టర్ వలీ ఉల్లాఖాద్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీలోని తిరుపతిలో నాలుగురోజులుగా నిర్వహించిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో వలీఉల్లాఖాద్రీని జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వలీఉల్లాఖాద్రీ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్రపోషించారు. కేయూ వేదికగా అనేక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఆ తర్వాత ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా కూడా దేశం వ్యాప్త విద్యార్థి ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. వలీఉల్లాఖాద్రీ కేయూలో కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ విభాగం నుంచి డాక్టరేట్ పొందారు.

త్రివేణి సంగమం.. భక్తజన సంద్రం

- సరస్వతీ నది పుష్కరాలకు పోటెత్తిన భక్తజనం
- ఐదో రోజు 80వేల మంది పుణ్యస్నానాలు


పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతీ నది పుష్కరాలకు సోమవారం ఐదోరోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి నదీమాతకు పూజలు చేశారు. చీరె, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పిండ ప్రదానాలు, పితృదేవతలకు తర్పణాలు నిర్వహించారు. భక్తులతో పుష్కరిణి నిండిపోయింది. పుష్కర స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

తగ్గిన రద్దీ

పుష్కరాలకు భక్తుల రద్దీ తగ్గింది. హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి.. మంథని, కాటారం మీదుగా.. అలాగే మంచిర్యాల, గోదావరిఖని, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్ నుంచి భక్తులు వాహనాల్లో తరలివచ్చారు. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు డివైడర్లు ఏర్పాటు చేసి నియంత్రించారు. పార్కింగ్ స్థలాల్లో వాహనాల రద్దీ కొనసాగింది. శని, ఆదివారాల్లో రెండేసి లక్షల చొప్పున భక్తులు రాగా.. సోమవారం 80వేల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేశారు.

నదీహారతికి రద్దీ

సరస్వతి ఘాట్‌లో కాశీపండితులచే ఏర్పాటు చేసిన నవరత్నమాలిక హారతికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఏడు గద్దెలపై తొమ్మిది హారతులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు. తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. సరస్వతీ అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు దర్శించుకున్నాక జ్ఞానతీర్థం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

నాసిక్ పీఠాధిపతి పూజలు

నాసిక్ త్రయంబకేశ్వర్ మహామండలేశ్వర్ ఆచార్య సంవిధానందా సరస్వతీ మహారాజ్ ముందుగా త్రివేణి సంగమంలోని అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర స్నానం.. విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకుని పూజలు చేశారు.

త్వరలో జిల్లాకు క్రికెట్ స్టేడియం

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు షురూ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ

వరంగల్ స్పోర్ట్స్: జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణ అంశాన్ని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు తీసుకెళ్లారని, త్వరలోనే స్టేడియం ఏర్పాటు ప్రకటన వెలువడనుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డిపురంలో సోమవారం అంతర్‌జిల్లాల క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో బీజంపడిన క్రికెట్ స్టేడియం నిర్మాణం.. ఇప్పుడు ఆచరణలోకి రానుందని, అందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో పాటు తానుకూడా ముందుండి నిర్మాణం జరిగేలా చొరవచూపుతానని భరోసా కల్పించారు. క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్డిపురంతో పాటు మొగిలిచర్ల గ్రౌండ్‌లో జనగామ, ములుగు, వంగాలపల్లి మైదానంలో వరంగల్, మహబూబాబాద్ జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లు కొనసాగాయని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సదాశివ్, తోట రాము, సంయుక్త కార్యదర్శి ఉపేందర్ పాల్గొన్నారు.